ప్రజాశక్తి
ఆదివారం 7 డిసెంబర్ 2025
5
విజయనగరం

గంటేడకు తాపీ ధర్మారావు పురస్కారం

ప్రజాశక్తి-పార్వతీపురం

గుంటూరుకు చెందిన బండిఖల్లు ఫౌండేషన్ ప్రదానం చేయనున్న తాపీ ధర్మారావు పురస్కారానికి పట్టణానికి చెందిన కవి, రచయిత గంటేడ గౌరు నాయుడు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం గుంటూరులోని కొరటాల సమావేశమందిరంలో జరగనున్న కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. బండిఖల్లు ఫౌండేషన్ విశాఖ సంస్కృతి మాసపత్రిక సౌజన్యంతో 9వ జాతీయ స్థాయి కథల పోటీలు నిర్వహించింది. విజేతలకు అవార్డుల ప్రదానోత్సవంలో గౌరు నాయుడుకు తాపీ ధర్మారావు పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

విషాద యాత్ర

అయ్యప్పస్వామి దర్శనానికి కలసి వెళ్లిన ఆ బంధువులు, స్నేహితుల ప్రాణాలు మధ్యలోనే గాలిలో కలిసిపోయాయి. సుదీర్ఘ ప్రయాణంలో అలసి పోయి రాత్రిపూట రోడ్డు పక్కన కారులో నిద్రపోతున్న వారిని మృత్యువు మరో కారు రూపంలో కబళించింది. ఈ ప్రమాదంలో కోరపు కొత్తవలసకు చెందిన ముగ్గురు, మరుపల్లి గ్రామానికి చెందిన మరొకరు మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో తీవ్ర విషాదం అలముకుంది.

- శబరిమల వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం, మరొకరికి తీవ్ర గాయాలు
- రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును ఢీకొన్న మరో కారు
- కోరపుకొత్తవలస, మరుపల్లిలో విషాదం

ప్రమాదానికి గురైన కారు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం సమీపంలో శుక్రవారం రాత్రి 2గంటల సమయంలో ఆగి ఉన్న కారును మరో కారు ఢీకొన్న ఘటనలో దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలసకు చెందిన ముగ్గురు, గజపతినగరం మండలం మరుపల్లి గ్రామానికి చెందిన ఒకరు దుర్మరణం చెందారు. కొండ కెంగువ గ్రామానికి చెందిన మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలసకు చెందిన వంగర రామకృష్ణ (51), మార్పిన అప్పలనాయుడు (33), మరడ రాము (50), మరుపల్లికి చెందిన బండారు చంద్రరావు (35) కలసి ఈనెల1న శబరిమలై అయ్యప్పస్వామి దర్శనానికి ఇక్కడి నుంచి కారులో వెళ్లారు. శబరిమలై కొండకు వెళ్లి దర్శనం అనంతరం వీరంతా తిరుగు ప్రయాణమయ్యారు. రామేశ్వరానికి 40కిలోమీటర్ల దూరంలో రామ నారాయణపురం దగ్గరకు వచ్చేసరికి నిద్ర వస్తుందని కారును రోడ్డుపక్కకు తీసి కారులోనే నిద్రించారు. అందరూ నిద్రలో ఉండగా వేగంగా వచ్చిన మరో కారు వీరి కారును వెనుకవైపు బలంగా ఢీకొంది. ఈ ఘటనలో రామకృష్ణ, అప్పలనాయుడు, మరడ రాము, బండారు చంద్రరావు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కొండ కెంగువకు చెందిన బెవర శ్రీరామ్‌కు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసి కోరపు కొత్తవలస, మరుపల్లిలో తీవ్ర విషాదం అలముకుంది.

రోదిస్తున్న మృతుల కుటుంబీకులు

రోడ్డు ప్రమాదంలో మృతులు

కుటుంబ నేపథ్యం

- మార్పిన అప్పలనాయుడుకు భార్య గాయత్రి, తల్లి రాములమ్మ తండ్రి తిరుపతి ఉన్నారు. షికారుగంజి రోడ్డు వద్ద చిన్న దుకాణం పెట్టుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు కావడం, కుటుంబాన్ని పోషించాల్సిన కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గతంలో కుమారుడు యాక్సిడెంట్‌లో చనిపోవడం, ఇప్పుడు అల్లుడు చనిపోవడంతో అదే గ్రామంలో ఉన్న అత్తామామలు రోదించారు.
- మరడరాముకు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య పైడితల్లి, కుమారుడు ప్రసాద్ ఉన్నారు. కుమారుడు డిగ్రీ పూర్తిచేసుకుని ఉద్యోగం కోసం ప్రిపేర్ అవుతూ కోచింగ్ తీసుకుంటున్నాడు. తండ్రి చనిపోయాడని తెలియడంతో తల్లి కొడుకు కన్నీరు మున్నీరయ్యారు.
- వంగర రామకృష్ణకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు భవాని, లత ఉన్నారు. వీరు డిగ్రీ చదువుకొని ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నారు. తండ్రి వడ్రంగి పని చేసుకుని కుటుంబాన్ని పోషించేవాడు. రామకృష్ణ మృతితో కుటుంబ సభ్యులు తామంతా ఎలా బతకాలని కన్నీరు గుండెలవిసేలా విలపిస్తున్నారు.
- గజపతినగరం మండలం మరుపల్లి గ్రామానికి చెందిన బండారు రామచంద్రరావుకు భార్య సత్యవతి, కుమారుడు ఉశ్రీకేష్, కుమార్తె శ్రీహిత ఉన్నారు గ్రామంలో షికారుగంజి రోడ్డు వద్ద చిన్న టిఫిన్ కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. చిన్నపిల్లలు కావడంతో పిల్లల్ని ఎలా పోషించాలని భార్య సత్యవతి రోదనలు మిన్నంటాయి. ఒకే గ్రామానికి ముగ్గురు చనిపోవడంతో గ్రామంతో పాటు ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం అలముకుంది.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి

సుజల స్రవంతి భూసేకరణ త్వరగా పూర్తి

కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంకోట, కంటోన్మెంట్

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు భూసేకరణ, నిర్మాణానికి సంబంధించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన భూసేకరణ, పూర్తి చేయాల్సిన ప్రక్రియలపై గ్రామాలవారీగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రూ.17,050 కోట్ల అంచనా వ్యయంతో ఉత్తరాంధ్రలో సుమారు 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని చెప్పారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోనే సుమారు 3.865 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని రెండు దశలుగా చేపట్టడం జరుగుతోందని, రెండో దశలోని మొత్తం 6 ప్యాకేజీల్లో మొదటి ప్యాకేజీలో కొంత భాగంతోబాటు, 2,4,5,6 ప్యాకేజీలు విజయనగరంలో ఉన్నాయని వివరించారు. విజయనగరం జిల్లాలో మొత్తం 9,630 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందని, దీనిలో కేవలం కాలువల నిర్మాణం కోసమే 4,495 ఎకరాలు అవసరం ఉంటుందని చెప్పారు. తక్షణ ప్రాధాన్యతగా 339.68 ఎకరాలను సేకరించాల్సి ఉందన్నారు. వెంటనే రైతులతో సమావేశాలను నిర్వహించి ప్రక్రియను పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ప్రాజెక్టు ఇఇ ఉమేష్‌కుమార్, భూసేకరణ విభాగం ఎస్‌డిసి కళావతి, చీపరుపల్లి ఆర్‌డిఒ సత్యవాణి, పలువురు డిఈలు, తాహశీల్దార్లు, డిటిలు పాల్గొన్నారు.

పరిశ్రమలకు త్వరగా అనుమతులు

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు వచ్చే ధరఖాస్తులకు వీలైనంత వేగంగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. గడువు పూర్తయ్యేవరకు వేచి చూడకుండా, వచ్చిన ధరఖాస్తులను వెంటనే పరిశీలించి, అనుమతించాలని సూచించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమావేశం కలెక్టరేట్‌లో శనివారం జరిగింది. జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి జిల్లా యంత్రాంగం తరపున అన్నివిధాలా సంపూర్ణ సహకారం అందించి, వీలైనంత వేగంగా స్థాపించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. కొత్తగా ఏర్పాటు కానున్న 6 పరిశ్రమల గురించి సమీక్షిస్తూ, వాటికి అవసరమైన సహకారాన్ని అందించాలని ఆయా శాఖలకు సూచించారు. సమావేశంలో పరిశ్రమలశాఖ డిడి ఎంవి కరుణాకర్, ఎపిఐఐసి జెడ్ఎం మురళీమోహన్, పొల్యూషన్ ఇంజనీర్ సరిత, అగ్నిమాపక అధికారి రాంప్రకాష్, నాబార్డ్ డిడిఎం నాగార్జున, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, ఇతర శాఖల అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

35 బహుళజాతి కంపెనీలకు 663 మంది ఎంపిక

జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

ప్రజాశక్తి-రాజాం

రాజాంలోని జిఎంఆర్ఐటిలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యాన ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శనివారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాకు 35 బహుళజాతి కంపెనీలు హాజరుకాగా, 1568 మంది యువతీ యువకులు వచ్చారు. ఇందులో 663 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోండ్రు మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఇదో అద్భుతమైన అవకాశమని అన్నారు. గతంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 400 మంది ఉద్యోగాలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్ కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి భాస్కర్, ఉపాధి కల్పనాధికారి వహీద్, రాజాం ఐటిఐ ప్రిన్సిపల్ భాస్కరరావు, జిఎంఆర్ఐటి ప్రిన్సిపల్ సిఎల్‌వి ఆర్ఎస్‌వి ప్రసాద్, అన్నం నాయుడు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు, టౌన్ సిఐ అశోక్, నంది సూర్య ప్రకాశరావు, జి.నారాయణరావు, డి.శ్రీను, దూబ ధర్మారావు పాల్గొన్నారు.

ఆసియన్ యూత్ పారా గేమ్స్‌కు ప్రేమ్‌చంద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దుబాయ్ వేదికగా ఈనెల 7 నుండి 14 వరకు జరుగబోయే ఆసియన్ యూత్ పారా గేమ్స్ కు విజయనగరం జిల్లాకు చెందిన పొట్నూరు ప్రేమ్ చంద్ ఎంపిక కావడం జిల్లాకు దక్కిన అరుదైన అవకాశమని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్ హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లకు ఒకసారి జరిగే ఈ ఆసియన్ యూత్ పారా గేమ్స్, ఆసియన్ గేమ్స్‌తో సమానమని అన్నారు. ఈ యూత్ ఆసియన్ గేమ్స్ కు ఆంధ్రప్రదేశ్ నుండి 8 మంది ఎంపిక కాగా అందులో మన జిల్లాకు చెందిన ప్రేమ్ చంద్ ఉండటం గర్వకారణమని అన్నారు. ఈ ఏడాది లక్నో లో జరిగిన నేషనల్ యూత్ పారా గేమ్స్ లో మెన్స్ డబల్స్ లో గోల్డ్, సింగిల్స్ లో బ్రాంజ్ మెడల్స్ గెలుచుకుని అంతర్జాతీయ ఛాంపియన్ షిప్ కు ఎంపికయ్యాడని తెలిపారు. ప్రేమ్ చంద్ ఎంపిక పట్ల కలెక్టర్ రాం సుందర రెడ్డి, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా క్రీడాధికారి ఎస్. వెంకటేశ్వరరావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వి. రామస్వామి అభినందనలు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో

హోంగార్డులు కీలకం

ఆవిర్భావ దినోత్సవంలో ఎస్‌పి దామోదర్

బెలూన్లు విడిచిపెడుతున్న ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

శాంతి భద్రతల పరిరక్షణలో హోంగార్డుల సేవలు కీలకమని ఎస్‌పి ఎఆర్ దామోదర్ అన్నారు. 63వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం పోలీసు పరేడ్ గ్రౌండులో శనివారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌పి హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆవిర్భావ దినోత్సవం సూచికగా శాంతి కపోతాలను, బెలూనులు ఎస్‌పితో పాటు ఎఎస్‌పి పి.సౌమ్యలతో ఎగురవేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని పోలీసు కార్యాలయం వద్ద ఎస్‌పి జెండాను ఊపి ప్రారంభించారు. ర్యాలీని పోలీసు కార్యాలయం నుండి దిశ పోలీసు స్టేషను వరకు నిర్వహించారు. అంతకుముందు పరేడ్‌ను ఉద్దేశించి ఎస్‌పి మాట్లాడుతూ పోలీసుశాఖకు, ప్రజలకు హోంగార్డులు అందిస్తున్న సేవలను కొనియాడారు. 63ఏళ్ల క్రితం దేశ అంతర్గత భద్రతకు, పోలీసులకు సహాయపడేందుకు స్వచ్ఛందంగా ఏర్పడిన హోంగార్డు వ్యవస్థ ఎన్నో విధాలుగా అభివృద్ధి చెంది, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుశాఖకు వెన్ను, దన్నుగా నిలుస్తున్నారన్నారు. పోలీసు ఉద్యోగుల వలే హోంగార్డులు కూడా సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకొని, కంప్యూటరు ఆపరేటర్లుగా, డ్రైవర్లుగా పని చేస్తున్నారన్నారు. నీతి, నిజాయితీ, అంకితభావంతో, క్రమశిక్షణతో పని చేసి జిల్లా పోలీసుశాఖకు మంచి పేరును తీసుకొని రావాలని కోరారు. హోంగార్డుల సంక్షేమానికి రాష్ట్ర పోలీసుశాఖ కట్టుబడి ఉందన్నారు. జిల్లా పోలీసుశాఖలో పని చేస్తూ, ఉద్యోగ విరమణ చేసినా, మరణించినా వారి కుటుంబానికి అండగా నిలిచేందుకు ఒక్క రోజు వేతనాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలందించాలని, వారికి సహాయకారిగా మెలగాలని ఎస్‌పి పిలుపునిచ్చారు. అనంతరం, విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన హోంగార్డులకు, నీట్ టర్నవుట్, పరేడ్ నిర్వహణలో ప్రతిభకనబర్చిన వారికి ఎస్‌పి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి ఈ.కోటిరెడ్డి, చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు, బొబ్బిలి డిఎస్‌పి జి.భవ్యరెడ్డి, సిఐలు, పలువురు ఎస్ఐలు,సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించిన మంత్రి, ఎమ్మెల్యేలు

అర్జీదారుతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-బొండపల్లి

గ్రామాల్లో ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం బొండపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నామన్నారు. పార్టీల రహితంగా గ్రామాభివృద్ధి చేస్తున్నామని, కూటమి ప్రభుత్వంపై కొంతమంది పని పెట్టుకొని విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి శ్రీధర్‌రాజు, ఎఎంసి వైస్ చైర్మన్ కోరాడ క్రిష్ణ, ఎంపిడిఒ జి.గిరిబాల, తహశీల్దారు డి.రాజేశ్వరరావు, సిడిపిఒ ఉమాభారతి, పిఎసిఎస్ అధ్యక్షులు బుద్దరాజు సత్యనారాయణ రాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి నంబూరి రాజేష్, దోకుల శ్రీను, సర్పంచులు కర్రోతు శ్రీనివాసరావు, ముదునూరు శ్రీనివాసరాజు, మీసాల జానకీరావు, నడుపూరి భాస్కర నాయుడు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. లక్కవరపుకోట ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. 60కు పైగా అర్జీలు అందాయి. ప్రతీ అర్జీని ఎమ్మెల్యే స్వయంగా స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణ అనుమతులు, రేషన్ కార్డులు, పింఛన్లపై అర్జీలు అధికంగా వచ్చాయి. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల రామకృష్ణ, పిఎసిఎస్ చైర్మన్ మారోతు రామారావు, టిడిపి మండల అధ్యక్షులు కరెడ్ల ఈశ్వరరావు, ఎఎంసి డైరెక్టర్ పుట్టా శ్రీను, ఉపాధ్యక్షులు తూర్పాటి రామారావు, సర్పంచ్ కోళ్ల భూపాల్ నాయుడు, మాజీ ఎంపిటిసి కొట్యాడ రాముడు పాల్గొన్నారు.

భోగాపురం : ముంజేరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రజాదర్బార్ నిర్వహించారు. రెవెన్యూ శాఖలో భూ సమస్యలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయి. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు కావడం లేదని బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కొంతమంది సిమెంట్ రోడ్లు నిర్మించాలని కోరారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే సత్వర పరిష్కార మార్గాలను ఎమ్మెల్యే సూచించారు.

పోలిపల్లిలో మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తన నివాసం వద్ద ప్రజా దర్బార్ నిర్వహించి, వినతులు స్వీకరించారు. భూ సమస్యలు, సిసి రోడ్లు, కాలువలు, ఎలక్ట్రికల్, గత ప్రభుత్వంలో ఉపాధి కోల్పోయిన బాధితుల సమస్యలపై వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ గరి వెంకటరమణ, కోరాడ తాతారావు పాల్గొన్నారు.





వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, లోకం నాగమాధవి

78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం నిర్ణయించగా ఇప్పటివరకు 326 ఆర్ఎస్‌కె ల ద్వారా 14,426 మంది రైతుల నుండి సుమారు 78వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ తెలిపారు. సేకరించిన ధాన్యానికి సంబంధించి రైస్ మిల్లర్లు ఇవ్వవలసిన సిఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సిఐ వారికి డెలివరీ చేసే కార్యక్రమాన్ని కెఎల్‌పురం ఎస్‌డబ్ల్యుసి గోదాములో జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి గాను 13,017 మంది రైతులకు రూ.140 కోట్లు చెల్లించామని తెలిపారు. చీపురుపల్లి మండలం, జి. అగ్రహారం గ్రామానికి చెందిన యల్లంటి సూర్యారావు, బూరాడ రమణ, తుంపిలి త్రినాధ అనే రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీపురుపల్లి మండలానికి చెందిన శ్రీ కేవీర్ వరలక్ష్మి రైస్ ఇండస్ట్రీ పై విచారణ జరిపించామని జెసి తెలిపారు. వారు ఎక్కువ కేజీలు డిమాండ్ చేస్తున్నట్లు విచారణ లో తేలడంతో ఆ రైస్ మిల్లును పోర్టల్ నుండి డి-ట్యాగ్ చేసి తదుపరి ధాన్యం కేటాయింపు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ బి. శాంతి కుమారి, ఎఫ్‌సిఐ క్వాలిటీ మేనేజర్ రీనా, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు బి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం

పింఛనుదారులు తమ లైఫ్ సర్టిఫికేట్‌లను 2026 సంవత్సరానికి తప్పనిసరిగా జనవరి 1 నుండి ఫిబ్రవరి 28 లోపు మాత్రమే సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి వి.నాగమహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్, డిసెంబర్‌లో సమర్పించిన లైఫ్ సర్టిఫికేట్లు 2026 సంవత్సరానికి చెల్లవని ఆయన తెలిపారు. కాబట్టి 2025 లో ముందే లైఫ్ సర్టిఫికేట్ ఇచ్చినవారు కూడా తప్పనిసరిగా మళ్లీ సమర్పించాలని ఆయన తెలిపారు. పెన్షన్ విడుదలలో ఇబ్బందులు తలెత్తకుండా సూచించిన తేదీల్లో లైఫ్ సర్టిఫికేట్లు తప్పనిసరిగా సమర్పించాలన్నారు.

ముంజేరు దళితుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని ముంజేరు గ్రామంలో నిర్మిస్తున్న మురుగునీటి కాలువపై జరుగుతున్న వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. స్థానిక పెత్తందారులు తమపై దాడి చేసి, కాలువను దౌర్జన్యంగా నిర్మించారంటూ సిద్దార్థ కాలనీకి చెందిన దళితులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఎంపిడిఒ కార్యాలయం ఎదుట టెంట్లు వేసుకుని రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు దళిత సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. తమపై జరిగిన దాడిపై అట్రాసిటీ కేసులు పెట్టామని తెలిసి ప్రతీకారంగా తప్పుడు కేసులను తమపై పెట్టారని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. దాడి ఘటనపై గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో రిలే నిరాహార దీక్షకు దిగుతున్నట్టు చెప్పారు. తక్షణమే కాలువ నిర్మాణ పనులను నిలిపివేసి, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు పాండ్రంకి వెంకటరమణ, ఎరుకొండ వెంకట రావు, వివి దుర్గారావు, బివి రమణ, వై.బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గురజాడపై దాడి... జాతి సంస్కృతికి విఘాతం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తెలుగు సాహిత్యానికి పునాది వేసిన మహనీయుడు గురజాడ అప్పారావు. ఆయన నివాసం కేవలం ఒక పాత ఇల్లు మాత్రమే కాదు... మన సాంస్కృతిక స్మృతి, చరిత్ర, వారసత్వానికి నిలువెత్తు సాక్ష్యం. సాహిత్యం వికసించిన ఈ గృహంపై వరుసగా జరుగుతున్న దాడులు, దోపిడీలు, ధ్వంసం ఇప్పుడు తీవ్ర ఆందోళన కలిగించే స్థాయికి చేరాయి. ఈనెల 1వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గురజాడ ఇంట్లో ప్రవేశించి తలుపులు, లైట్లు, ఇతర సామగ్రి ధ్వంసం చేశారు. గురజాడ ఉపయోగించిన సామాగ్రి భద్రపర్చిన గది తాళాలను కూడా విరగ్గొటారు. ఈ ఘటనతో కలిపి ఇది మూడో దాడి. ఈనేపథ్యంలో ఈ గృహం ఎవరి సంరక్షణలో ఉంది? ఎందుకు పట్టించుకోవడం లేదు? అంటూ జనం అనేక ప్రశ్నలు సంధిస్తున్నారు. వారం రోజుల క్రితమే గురజాడ ప్రతి వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా సాహితీస్రవంతి, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన సభలో అనేక మంది సాహితీవేత్తలు, కవులు, కళాకారులూ పాల్గొన్నారు. చాలా కాలం నుంచి కోరుతున్నట్టే గురజాడ స్వగృహాన్ని పరిరక్షించడంతోపాటు సాహితీ కేంద్రంగా తీర్చిదిద్దాలని వచ్చిన మేధావులంతా మొత్తుకున్నారు. అంతకు ముందు అనేక వితనతులు కూడా ఇచ్చారు. ఇప్పటిలాగే మరో సంస్థ ఏర్పాటు చేసిన గురజాడ సాహితీ పురస్కార సభలో అనేక మంది అధికారులు, ప్రజా ప్రతినిధులూ, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. వీరు కూడా గురజాడను మహానుభావుడిగా ప్రశంసించారు. కానీ, ఆయన సాహిత్యాన్ని, సంస్కృతీ, సంప్రదాయాలను అందచేసిన గురజాడ నివాసాన్ని రక్షించేందుకు మాత్రం పాలకులు ముందుకు రావడం లేదు. అవకాశం దొరికినప్పుడల్లా సీసీ కెమెరాలు పెడతామని, భద్రత కట్టుదిట్టం చేస్తామని, మ్యూజియంగా అభివృద్ధి చేస్తామని వాగ్దానాలు సంవత్సరాలుగా పునరావృతమవు తున్నాయి. కానీ జరిగే దాడులు మాత్రం ఆ వాగ్దానాలే అసత్యమని స్పష్టం చేస్తున్నాయి. దీంతో, గురజాడపై ప్రభుత్వ నీతి మాటల్లో గౌరవం, చేతల్లో నిర్లక్ష్యం అన్నట్టుగా ఉందని సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు విమర్శిస్తున్నారు.

ఒక రాష్ట్ర చరిత్ర, సాహిత్యం, సంస్కృతి అంటే పదిల పరచాల్సిన బాధ్యత పురావస్తు శాఖది. ఇందుకు తగ్గట్టే గురజాడ స్వగృహం పురావస్తు శాఖ పరిధిలోనే ఉంది. కానీ గురజాడ ఇంటిపై జరుగుతున్న సంఘటనలు వరుసగా సాగుతున్నప్పటికీ పట్టడం లేదు. ఈ ఇంటిని చారిత్రక స్థలంగా గుర్తించడంలో విఫలం చెందిందని జనం చర్చించుకుంటున్నారు. ఇది ఒక శాఖ వైఫల్యం మాత్రమే కాదని, ఒక జాతి సాహిత్య వారసత్వాన్ని గౌరవించకపోవడం కూడా అవుతుందని పలువురు విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వంలోని లోపాలను, తప్పొలను ప్రశ్నిస్తే దేశభక్తి లేదంటూ నేడు ముద్రలు వేస్తున్నారు. హామీలు అమలు చేయమంటే దాడులకు తెగబడుతున్నారు. కులాలు, మతాల పేర పాలకులే చిచ్చురేపుతున్నారు. వాస్తవానికి ఇటువంటి కుతంత్రాలనే మహాకవి గురజాడ వందేళ్ల క్రితమే ప్రశ్నించాడు. బహుసా ఇటువంటి పాలకుల కోసమేనేమో దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్ అన్నాడు. వట్టిమాటలు కట్టిపెట్టి... గట్టిమేల్ తలపెట్టవోయ్... ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్ అని కూడా ప్రశ్నించాడు. ఇంకా దేశాభిమానం నాకు కద్దని వట్టి గొప్పలు చెప్పుకోవద్దని, మతాలు వేరైనా మనుషులు ఒక్కటిగా ఉండాలని, జాతులు అన్నదమ్ములవలె మెలిగితే మతములన్నీ మాసిపోతాయని చెప్పాడాయన. బహుసా ప్రజల శ్రమను, జాతీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న పాలకవర్గాలకు గురజాడ సాహిత్యం మింగుడు పడడం లేదోమో. ఓర్వలేమి పిశాచిదేశం మూలుగులు పీల్చేనోయ్ అంటూ ఆయన చెప్పినట్టే గురజాడ ఉనికి దెబ్బతీయడానికి దుండగులు వరుసగా దాడులకు తెగబడుతున్నారు. ఇది ఆకతాయిల పని అని కాసేపు అనుకున్నా. విచారణ జరిపి వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? రక్షణ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు... అంటూ జనం ప్రశ్నిస్తున్నారు. సాహితీవేత్తలు, కవులు, రచయితలు గురజాడ ఇంటిపై జరుగుతున్న దాడులను మాత్రమే కాదు... ప్రభుత్వం, ముఖ్యంగా పురవస్తు శాఖ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. గురజాడ ఇంటిని స్మారక చిహ్నంగా ప్రకటించాలని, ఆయన జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. 'గురజాడ ఇంటిలో ఉన్న పత్రాలు, వస్తువులు, ఆయన ఉపయోగించిన సామగ్రి అన్నీ చరిత్ర. ఒకసారి అవి నశిస్తే, తిరిగి పొందలేము. కొత్త తరాలకు అది అందించలేం. అందుకే ఈ దాడులు కేవలం క్రిమినల్ చర్యలు మాత్రమే కాదు. ఇవి మన జ్ఞాపకాలు, సంస్కృతిపై దాడులు అని సాహితీవేత్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిజిటల్ అసిస్టెంట్‌కు మెమో

ప్రజాశక్తి-రాజాం

మండలంలోని జిసిహెచ్‌పల్లి గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ భూషణ్‌కు మెమో జారీ చేసినట్లు డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం సోపేరు, జిసిహెచ్ పల్లి సచివాలయాలను ఆయన సందర్శించారు. జిసిహెచ్‌పల్లి డిజిటల్ అసిస్టెంట్ భూషణ్ గత నెల 24 నుండి విధులకు హాజరు కావడం లేదని గుర్తించారు. దీంతో ఆయనకు మెమో జారీ చేసినట్లు చెప్పారు.

సమయపాలన పాటించాల్సిందే

ప్రజాశక్తి-దత్తిరాజేరు

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఐసిడిఎస్ పీడీ, మండల ప్రత్యేకాధికారి విమలారాణి ఆదేశించారు. మండలంలోని షికారుగంజ్, రామచంద్రపురం, పాచలవలస, కె.కొత్తవలస గ్రామ సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాలను శనివారం పరిశీలించారు. సచివాలయ సిబ్బంది హాజరు, స్పందన, శానిటేషన్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాల పనితీరును పరిశీలించారు. కేంద్రంలో ఉన్న స్టాకు రికార్డులను తనిఖీ చేశారు. పిల్లలకు మెనూ సక్రమంగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణులకు, బాలింతలకు సరుకులు క్రమం తప్పకుండా పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్యామలత, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహవసతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అర్హులైన ప్రతి ఒక్కరికి గృహ వసతి కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శనివారం హౌసింగ్ డిఇ రంగారావుతో కలిసి ఎనిమిటీస్ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉగాది నాటికి ఐదు లక్షల ఇంటి నిర్మాణాలు పూర్తి గృహప్రవేశాలు చేసే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు రచించిందన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో 2,300 ఇళ్లకు గృహప్రవేశాలు జరిగే విధంగా లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. మధ్యలో నిలిచిపోయిన 1600, ప్రస్తుతం మంజూరైన 700 ఇళ్లను పూర్తి చేసే విధంగా ఎమినిటీస్ కార్యదర్శులు, గృహనిర్మాణ సంస్థ సిబ్బంది చొరవ చూపాలని అన్నారు. లబ్ధిదారులకు మరింత చైతన్యం తీసుకువచ్చి త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే విధంగా కృషి చేయాలని సూచించారు.

ప్రభుత్వ భూముల క్రయవిక్రయాలు నేరం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అసైన్డ్, ప్రభుత్వ భూముల క్రయవిక్రయాలకు పాల్పడితే పిఒటి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని పుణ్యగిరికి వెళ్లే రహదారిలో సర్వే నంబర్ 481లోని అసైన్డ్ భూములను జెసిబితో చదును చేసి అమ్మకాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదు మేరకు శనివారం ఆ భూమలను మండల సర్వేయర్ రాముతో కలిసి తహశీల్దార్ సర్వే చేయించారు. అనుమతులు లేకుండా అసైన్డ్ భూములను చదును చేయించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మకాలు, కొనుగోళ్లు జరిగినట్లు విచారణలో తేలితే పిఒటి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేకాధికారి సమీక్ష

ప్రజాశక్తి-సంతకవిటి

మండలంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ ఎస్.శారదాదేవి ఆదేశించారు. గొళ్లవలస, తమరం, చిత్తరివురం తదితర సచివాలయాలను సందర్శించారు. సచివాలయ సేవల అమలు, ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో శారదాదేవి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే గుర్తించి, వేగవంతంగా పరిష్కారం చూపాలన్నారు. సచివాలయ వ్యవస్థ పట్ల ప్రజలకు నమ్మకం పెంచే విధంగా పని చేయాలి అని సూచించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సురేష్‌కుమార్, ఎపిఒ హరినాథ్, ఆర్‌ఐ కృపారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనానికి శంకుస్థాపన

తెర్లాం : మండలంలోని అప్పలమ్మపేట పంచాయతీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బేబినాయన శనివారం శంకుస్థాపన చేశారు. రూ.32 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఎంపిసి చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, మర్రాపు శంకర్రావు, మర్రాపు యుగంధర్, కరణం రమేష్‌నాయుడు, సర్పంచ్ గురవాన పార్వతి, గురవాన సూర్యనారాయణ, గురవాన బాలకృష్ణ పాల్గొన్నారు.

గురుదేవ్ ట్రస్ట్‌ను సందర్శించిన కలెక్టర్

కొత్తవలస : మండలంలోని మంగళపాలెం వద్దనున్న గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్, డాక్టర్ ఉప్పలపాటి మెమోరియల్ కేన్సర్ ఆసుపత్రిని శనివారం కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందించి, వారితో ముచ్చటించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు రాష్ట్ర జగదీష్‌బాబు, డిప్యూటీ తహశీల్దార్ సునీత, ఆర్‌ఐ షణ్ముఖ పాల్గొన్నారు.

మోడల్ పేపర్లు పంపిణీ

నెల్లిమర్ల : మండలంలోని కొండగుంపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాథ్ సొంత నిధులతో సమకూర్చిన మోడల్ పేపర్లను ఆయన కుమార్తె సమీరా శనివారం పంపిణీ చేశారు. యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లను నాలుగేళ్లుగా అందజేస్తున్నట్లు త్రినాథ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ సూర్యనారాయణ మూర్తి, ఎస్ఎంసి చైర్మన్ పతివాడ శంకరరావు, ఇన్‌ఛార్జి హెచ్ఎం సత్యప్రకాశ్, ఆర్ నాగేశ్వరరావు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు మద్దిల సత్యనారాయణ, ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు ఉద్ది సత్యనారాయణ పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

బొబ్బిలి : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ షాపులను శనివారం డిఎస్ఒ మురళినాథ్ తనిఖీ చేశారు. రేషన్ షాపుల్లో స్టాక్, రికార్డులను పరిశీలించారు. లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. ఆయనతో సిఎస్ డిటి సాయికృష్ణ ఉన్నారు.

జెఎన్‌టియులో 'యూనివర్సిటీ హెల్త్ అవర్ విత్ నేచర్' ప్రారంభం

విజయనగరం టౌన్ : జెఎన్‌టియుజివిలో ఆరోగ్యం, ప్రకృతిని సమన్వయం చేస్తూ, శారీరక, మానసిక శ్రేయస్సును పెంపొందించేందుకు 'యూనివర్సిటీ హెల్త్ అవర్ విత్ నేచర్' అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జెఎన్‌టియు కాకినాడ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ పి.ఉదయభాస్కర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి విసి సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందిలోఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవాటు చేసుకొని, పచ్చని పరిసరాలతో అనుబంధాన్ని పెంపొందించుకోవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఆధునిక యుగంలో పెరుగుతున్న కాలుష్య సమస్యల నేపథ్యంలో పర్యావరణ ప్రాధాన్యతను గుర్తుచేస్తుందని అన్నారు. అంధులకులలో ఉన్న పార్కులు, మార్గాలు, విస్తారమైన సహజవాతావరణాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య వంతమైన విశ్వవిద్యాలయముగా రూపుదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి.జయసుమ పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రాణాలు కాపాడుకోగలం

విజయనగరం టౌన్ : హార్ట్ ఎటాక్ మరణాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ సిపిఆర్ పై అవగాహన కలిగి ఉండాలని ఐఎస్ఎస్ఎంసిపిఎం కన్వీనర్ డాక్టర్ ఎం.రామారావు అన్నారు. శనివారం స్థానిక సన్ స్కూల్, ఎస్ఎస్ కాలేజీలో విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన కల్పించారు. ప్రధానంగా జిల్లాలో కన్నడ హీరో పునీత్ రాజ్ కుమార్ వంటి ఎంతోమంది సెలబ్రిటీలు, నాయకులు చనిపోవడం జరిగిందన్నారు. హార్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే మనం గుండెను రెండు చేతులతో ఎల్లా పట్టుకొని ఎన్ని సార్లు ఒత్తిడి చేయాలో మానవ శరీర భాగాల ఆధారంగా చేసి చూపించారు. ముఖ్యంగా యువతలో ఈ అవగాహన పెరగాలనే ఉద్దేశంతో దేశ వ్యాప్తంగా సిపి ఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితిలో సిపిఆర్ ఎలా చేసుకోవాలో అవగాహన కలిగి ఉండటం ద్వారా మనిషి ప్రాణాలు కాపాడేందుకు దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు నవీన్ గుప్తా, అశుతోష్ భరద్వాజ్, సునీత్ కుమార్ గార్గ్, ప్రగ్యాన్ కుమార్ రౌత్, ఆరిఫ్ ఫాషా, ఢిల్లీ నుండి, సూర్యప్రకాశ్, విజయనగరం నుంచి త్యాశ్వితాకారి లక్ష్మి, ఎం.రవికృష్ణ, ఎ.శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

కొత్తవలస : కొత్తవలసలో శనివారం సిఐ షణ్ముఖరావు ఆధ్వర్యాన ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లను వాహనాల వెనకవైపు అంటించారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

విజయనగరంలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బిఎస్ఎన్ఎల్ డిజిఎం దాలినాయుడు, అధికారులు, ఉద్యోగులు

జిల్లా వ్యాప్తంగా శనివారం అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తెర్లాం, రాజాంలో అంబేద్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యేలు బేబినాయన, కోండ్రు మురళీమోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యాన వర్ధంతి కార్యక్రమాలు చేపట్టారు.

తెర్లాం, రాజాంలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు బేబినాయన, మురళీమోహన్

సంపద స్వర్ణ ధాన్యం కొనుగోలు చేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -బొబ్బిలి

సంపద స్వర్ణ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో రైతులు సంపద స్వర్ణ ధాన్యం విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తే నేడు మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులు, వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. చక్కెర పరిశ్రమలు మూతపడటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సంకిలి యాజమాన్యం చెరకు మద్దతు ధరను తక్కువ ప్రకటించిందని చెప్పారు. ఆయనతో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, రామభద్రపురం ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్ ఉన్నారు.

ప్రయివేటీకరణ ఆగేవరకూ ఉద్యమం

చీపురుపల్లి : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆగే వరకూ ఉద్యమం కొనసాగిస్తామని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలనే కుట్రలో భాగంగా ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రయివేటుపరం చేయాలని చూస్తోందని దుయ్యబట్టారు. దీనికి వ్యతిరేకంగా ఈ నెల ఎనిమిదో తేది వరకు సంతకాలు సేకరిస్తామన్నారు. 10న నియోజకవర్గ స్థాయి, 15న జిల్లాస్థాయిలో పెద్ద ఎత్తున ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. మెగా పేరెంట్, టీచర్ మీట్ కార్యక్రమాన్ని పాఠశాల కాకుండా వేరే ప్రదేశంలో ఏర్పాటు చేయడం సరికాదన్నారు. పాఠశాలలో ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తే అక్కడున్న సమస్యలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలిపేందుకు వీలుంటుందని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ఏ పాఠశాలలో కూడా విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందడం లేదని, విద్యార్థుల తల్లిదండ్రులే క్యారేజీల ద్వారా ఇంటి నుండి ఆహారాన్ని అందించే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి కె.వి సూర్యనారాయణ రాజు, డిసిసిబి మాజీ డైరెక్టర్ ఎస్‌వి రమణరాజు, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కేంద్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా ప్రతి ఇంట్లో ఒక్క మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలని డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి అన్నారు. శనివారం విజయనగరం మండలంలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన జీవనోపాధుల యూనిట్లను ఆయన పరిశీలించారు. బడ్డుకొండపేట పంచాయతీలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ అంబ్రాయిడింగ్, బ్యూటీషియన్ యూనిట్లను ఆయన పరిశీలించారు. వాటికి చెందిన వివరాలను యూనిట్ నిర్వాహకులైన రమతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ పథకాల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఆయా పథకాల ద్వారా సుమారు రూ.689 కోట్లు వరకు మహిళలకు అందించామని తెలిపారు. తీసుకున్న డబ్బులు సొంతానికి కాకుండా ఇటువంటి స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటుకు ఉపయోగించుకోవాలని తెలిపారు. మహిళలు ముందుకు వస్తే ఎటువంటి పథకాలైన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న బ్రిక్స్ యూనిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎపిఎం స్వామి, సిబ్బంది జగన్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల ఆదాయం పెంచాలి : డిఆర్‌డిఎ పీడీ

స్వయం సహాయక సంఘాల మహిళల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వ పథకాలను వినియోగించుకునేలా చూడాలని డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి అన్నారు. శనివారం పలుశాఖల అధికారులతో డిఆర్‌డిఎ సమావేశం హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పిఒలను బలోపేతం చేయడానికి, సభ్యులకు ఆదాయం పెంచడానికి కృషి జరగాలన్నారు. వ్యాపారాలకు అవసరమైన లైసెన్సులు తీసుకోవడం చేయాలన్నారు. నాబార్డు సహకారంతో గ్రామ దుకాణ్, ఎల్ఇడిపి కార్యక్రమాలు చేపట్టామన్నారు. లాభదాయక హార్టికల్చర్ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమాలు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

త్వరలో ఎఎంసికి సొంత భవనం

చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు

ప్రజాశక్తి-కొత్తవలస

ఎమ్మెల్యే లలితకుమారి హామీ మేరకు కొత్తవలస వ్యవసాయ మార్కెట్ కమిటీకి సొంత భవనానికి స్థలం కేటాయించారని, త్వరలో నిర్మాణం ప్రారంభిస్తామని చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు తెలిపారు. శనివారం కొత్తవలస ఎఎంసి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొత్తవలసలో రైతు బజార్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామని చైర్మన్ తెలిపారు. సమావేశంలో ఎఎంసి కార్యదర్శి కె.విజయబాబు, డైరెక్టర్లు మల్లువలస శ్రీను, ఎర్ర వెంకటలక్ష్మి, గేదెల శ్రీనమ్మ, ఆడారి రమేష్, గనివాడ వెంకటలక్ష్మి, కోటాన అర్జున్‌రావు, మిడతాను శ్రీదేవి, అక్కివరపు సీతమ్మ పాల్గొన్నారు.

ఎపిఎన్‌జిఒ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి-భోగాపురం

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ భోగాపురం తాలూకా కార్యవర్గం శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల అధికారి ఎల్.అప్పలనాయుడు, సహాయ ఎన్నికల అధికారి ఎం.అప్పలస్వామి ఈ ప్రక్రియ చేపట్టారు. నూతన అధ్యక్షులుగా కొమ్మూరు దుర్గారావు, అసోసియేట్ అధ్యక్షులుగా సిహెచ్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కె.సునీల, ఎన్.రవికుమార్, డి.రవి కుమార్, మహిళా ఉపాధ్యక్షులుగా పి.కృష్ణవేణి, కార్యదర్శిగా సిహెచ్.అప్పలనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.హేమంత్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు వై.సత్యనారాయణ, వై.స్వాతి, షేక్ మౌలాలి, టి.సౌజన్య సాహితీ, కోశాధికారిగా కె.చిన్నారావు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా కె.ఆదిలక్ష్మి వ్యవహరించారు. ఈ సందర్భంగా హాజరైన ఉద్యోగులతో జాతీయ రహదారి సర్వీస్ రోడ్లో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టి.శ్రీధర్‌బాబు, కార్యదర్శి ఎ.సురేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేకాధికారి పర్యటన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బల్లంకి, బానాది గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ శనివారం పర్యటించారు. సచివాలయాలను సందర్శించారు. సమయపాలన పాటించి, కేటాయించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాల్సిన అవసరాన్ని సచివాలయ సిబ్బందికి వివరించారు. అనంతరం చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, వాటితో వర్మీ కంపోస్ట్ తయారీ చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. బానాదిలో ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాది హామీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని పుణ్యగిరికి వెళ్లే రహదారిలో సర్వే నంబర్ 168లోని ఇళ్ల స్థలాల్లో తాగునీటి బోరుకు శనివారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శంకుస్థాపన చేశారు. విలేకరులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో మౌలిక వసతుల కల్పన దిశగా అడుగులు పడుతున్నాయని. ఇందులో భాగంగానే మండల పరిషత్ నిధుల నుంచి బోరు మంజూరు చేయించామని ఎమ్మెల్సీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సోమేశ్వరావు, వబ్బిన సతీష్, మోపాడ శ్రీను, గంగరాజు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -బొబ్బిలి

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ పోరాట సమితి ఆధ్వర్యంలో రాజా కళాశాల మైదానంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను శనివారం ఎమ్మెల్యే బేబినాయన ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలకు సాయి గౌతమి విద్యార్థులు

ప్రజాశక్తి-గజపతినగరం

విజయనగరంలో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో విజులైజేషన్ విభాగంలో ఇ.మధు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ఎస్ నాయుడు తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో జి.గౌతమ్, బి.వినయ్ తృతీయ స్థానం సాధించడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు

మృతి చెందిన చేపలు తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక పెద్ద చెరువులో అధిక మొత్తంలో మృతి చెందిన గౌరస చేపలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ప్రజారోగ్య సిబ్బందికి కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. శనివారం ఆయన పెద్ద చెరువు చుట్టూ కలియతిరిగి పరిస్థితిని సమీక్షించారు. గత రెండు రోజులుగా పెద్ద చెరువులో గౌరస చేపలు విపరీతంగా మృతి చెందడం వల్ల అవి నీటిలో తేలి దుర్గంధ భరిత వాతావరణం వెదజల్లుతోంది. ఈనేపథ్యంలో మృతి చెందిన చేపలను తొలగించి, యదాస్థితికి తీసుకురావాలని ఆదేశించారు. దీంతో ఇరు శాఖల సిబ్బంది మతి చెందిన చేపలను పెద్ద ఎత్తున సేకరించి వాటిని గుణుపూరు పేట లో ఉన్న డంపింగ్ యార్డ్ వద్ద గొయ్యి తీసి పాతి పెడుతున్నారు. అలాగే పెద్ద చెరువు చుట్టూ బ్లీచింగ్, ఇతర రసాయనాలను పిచికారీ చేసి శుభ్రపరుస్తున్నారు.

స్క్రబ్‌టైఫస్ కిట్లు అందుబాటులో ఉంచండి

ప్రజాశక్తి-వంగర

స్క్రబ్ టైఫస్ వైరస్ పరీక్ష కిట్లు పిహెచ్‌సిలో అందుబాటులో ఉంచాలని ఎంపిపి యు.సురేష్ ముఖర్జీ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా వైద్య శాఖకు సంబంధించిన చర్చలో గ్రామాల్లో కుక్కలు మనుషులపై, జంతువులపై దాడి చేస్తున్నందున మందులు అందుబాటులో ఉన్నాయా? లేవా? అని అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ చర్చలో వరిపంటకు వ్యవసాయ శాఖ సిబ్బంది ఇ-క్రాప్ పూర్తిస్థాయిలో చేయకపోవడంతో రైతులు ధాన్యం అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని, బాధ్యతారహితంగా పని చేస్తున్నారని వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. సర్పంచుల సంతకాలు లేకుండా గోకులం షెడ్లను మంజూరు చేశారని ఎపిఒను ప్రశ్నించారు. పంచాయతీ తీర్మానాలు ఉన్న దరఖాస్తులకే షెడ్లు మంజూరైనట్లు సభలో తెలిపారు. మిగతా ఏ శాఖకు సంబంధించి చర్చ జరగకుండానే సమావేశం ముగించారు. సమావేశంలో తహశీల్దార్ పిన్నింటి రామారావు, డిప్యూటీ ఎంపిడిఒ కెల్ల రామారావు, కె.సుదర్శనరావు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌పి ఎఆర్ దామోదర్ హెచ్చరించారు. ఆర్టీసి కాంప్లెక్సు వద్ద ఆటోలను అస్తవ్యస్తంగా నిలిపి, ఇతర వాహనాలకు, ప్రయాణీకులకు ఇబ్బందులు కలిగిస్తున్న కారణంగా ఆటోలను విజయనగరం ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేయడంతో, ఆటో డ్రైవర్లు జిల్లా ఎ ఎస్‌పిని కలిసి, తమ ఇబ్బందులను తెలిపేందుకు పోలీసు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా వారికి ఎస్‌పి కౌన్సిలింగ్ చేశారు. రహదారి భద్రత అందరి బాధ్యతని, ఆటో డ్రైవర్లు నిర్లక్ష్యం కారణంగా ఎక్కువగా రహదారి ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకే ఆర్టీసి కాంప్లెక్సు, ఎత్తు బ్రిడ్జి, దాసన్నపేట రైతు బజారు, గంట స్తంభం వద్ద నిర్లక్ష్యంగా పార్కింగు చేసిన ఆటోలను సీజ్ చేసామన్నారు. ఇకపై రహదారి భద్రత నియమాలు పాటిస్తే, సానుకూలంగా వ్యవహరిస్తామని, లేకుంటే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను అనుమతించవద్దని, డ్రైవరు సీటులోకి ప్రయాణికులను కూర్చోబెట్టవద్దని, ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలని, నిబంధనలకు విరుద్ధంగా స్కూలు పిల్లలను అనుమతించవద్దన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ సిహెచ్.సూరి నాయుడు, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.బాస్కర రావు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-మెంటాడ

లైంగిక వేధింపులను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిడిఒ పి.సుదర్శన్ స్పష్టంచేశారు. ఆర్‌బిఎస్‌కె విభాగం సైకాలజిస్ట్ ఉదయ్ శ్రీనివాసు ఆధ్వర్యంలో మెంటాడ హైస్కూల్లో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లలపై లైంగిక దాడులు ఎలా జరుగుతున్నాయి, ఎలా నివారించాలి, పోక్సో చట్టంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ కె.మోహన్‌రావు, ఎస్ఐ కె.సీతారాం, పిహెచ్‌సి డాక్టర్ జి.కల్పన, సిహెచ్‌ఒ సత్యనారాయణ, పెదమేడపల్లి హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దెంకాడ : స్థానిక పిహెచ్‌సిలో బాలికలపై లైంగిక వేధింపుల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. మానసిక ఆరోగ్య జిల్లా నోడల్ అధికారి డాక్టర్ దీప్‌చంద్ మాట్లాడుతూ లైంగిక వేధింపుల వల్ల పడే మానసిక ప్రభావాన్ని గుర్తించి, వారికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు శివరామకృష్ణ, శరణ్య, సిబ్బంది పి.మంగ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : వైద్యారోగ్య, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో లైంగిక వేధింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఇఒ సూర్యనారాయణ మూర్తి, కొండవెలగాడ పిహెచ్‌సి డాక్టర్ శిరీష, సిడిపిఒ మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక సికెఎం జిజె కళాశాలలో పోక్సో చట్టంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో భోగాపురం రూరల్ సిఐ రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.గణేష్, కళాశాల ప్రిన్సిపల్ ఎం.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో పిల్లల భవిష్యత్తు నాశనం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

బాల్యవివాహం పిల్లల భవిష్యత్తును నాశనం చేసే అత్యంత హానికరమైన సామాజిక ఆచారమని సిడిపిఒ అచ్యుతాంబ అన్నారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం బాల్యవివాహ నిరోధక కమిటీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బాల్య వివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఇటువంటి కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సతీష్, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంఇఒ నర్సింగరావు, ఎఎన్ఎంలు, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

దెంకాడ : వెలుగు కార్యాలయంలో బాల్యవివాహ నిరోధక కమిటీ సమీక్షా సమావేశాన్ని ఐసిడిఎస్ పిఒ లావణ్య ఆధ్వర్యాన నిర్వహించారు. ఎంపిడిఒ వై.భవాని, తహశీల్దార్ రాజారావు, ఎస్ఐ సన్యాసినాయుడు, పిహెచ్‌సి వైద్యాధికారి శివరామకృష్ణ, ఎపిఎం శ్రీనివాసరావు, ఎఒ రామకోటి, ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ప్రతినిధి శివకుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, కార్యదర్శులు, ఎఎన్ఎంలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

అపరాల పంటలపై అవగాహన

ప్రజాశక్తి-దత్తిరాజేరు

రబీలో అపరాల పంటల సాగుపై రైతులకు ఎఒ అనురాధ అవగాహన కల్పించారు. శనివారం రాజుల రామచంద్రపురం రైతు సేవా కేంద్రంలో ఆత్మ సౌజన్యంతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు చెల్లూరి అప్పలనాయుడు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఇఒ పి.బాల భాస్కరరావు సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, కిచెన్ గార్డెన్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న రాగి జావను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఆర్ఎంటి కె.రామప్రసాద్ పాల్గొన్నారు.

అద్దె బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దీర్ఘకాల అద్దె బకాయిలను ఉపేక్షించబోమని సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు స్పష్టం చేశారు. శనివారం నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న దుకాణ సముదాయాలకు వద్దకు వెళ్లి అద్దె బకాయిలను రాబట్టారు. బకాయిలున్న దుకాణాలను సీజ్ చేశారు. మరికొందరు గడువు కోరిన మీదట వెసులుబాటు కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో అద్దెలను చెల్లించి సంస్థకు సహకరించాలని చెప్పారు. లేని యెడల రెడ్ నోటీసులు జారీచేసి బకాయిలు వసూలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి-శంగవరపుకోట

గుడిలోవ గిరిజనులకు స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు శనివారం రగ్గులు పండ్లు పంపిణీ చేశారు. ఆ సంస్థ సభ్యులతోపాటు కొట్టాం హైస్కూల్ హెచ్ఎం పి.వి.రామ్‌కుమార్ సహకారంతో వీటిని అందజేశారు. సంస్థ అధ్యక్షులు ఎఎస్ వెంకట్రావు, ఉపాధ్యక్షులు బుగత వెంకటేశ్వరరావు, కార్యదర్శి మంథా సుబ్బారావు, కోశాధికారి గణేష్, సభ్యులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై అవగాహన

కొత్తవలస : మండలంలోని తుమ్మికాపల్లి, అప్పన్నపాలెం, సీతంపేట, దేవాడ, రామలింగాపురం, వీరభద్రపురం, చిన్నిపాలెం గ్రామాల్లో స్క్రబ్ టైఫస్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఇఒ నరసింహారావు, పిహెచ్ఎన్ జగదాంబ, హెచ్‌వి పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎంఎల్‌హెచ్‌పిలు కామేశ్వరి, ధనలక్ష్మి, అనూషారాణి, గీతిక పాల్గొన్నారు.

IN THE HON`BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT : NARSIPATNAM (JUNIOR DIVISION)

O.S.NO.137/2023

Between :
మాకిరెడ్డి. వెంకట కనక మహాలక్ష్మి ...వాది
And
పందిరి. వరహా లక్ష్మి నరసింహకృష్ణ ..ప్రతివాది

To, ప్రతివాది : సూట్ సమన్లు
పందిరి వరహా లక్ష్మి నరసింహకృష్ణ,
తండ్రి పందిరి అప్పారావు టీచరు,
వి.టి. అగ్రహారము కాలనీ, విజయనగరం,
విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలో శ్రీకోర్టువారు పంపిన సమన్లు మీరు అందుకోనందున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తే.16.12.2025దికి** వాయిదా వేసియున్నారు. కావున ఈ రోజు **ఉదయం 10.30ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీ తరపున అడ్వకేట్ గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేనిచో మీ పరోక్షమందు పై దావాను తీర్మానించబడునని ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది.

NARSIPATNAM
Dt. 29-11-2025

రుత్తల అప్పారావు
అడ్వకేట్
నర్సీపట్నం
సెల్ : **9849830515**

ఎస్‌డిసి విచారణ

ప్రజాశక్తి - సంతకవిటి

2020లో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన అక్రమాలపై హైకోర్టు ఆదేశాల మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి శనివారం విచారణ నిర్వహించారు. 2020లో ఎసిబి దాడుల్లో డాష్‌బోర్డు, భూరీసర్వే, ఆన్‌లైన్ దరఖాస్తులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించారు. కంప్యూటర్ ఆపరేటర్లు అదపాక కాశి, షేక్ హసీనా బేగంపై ఎసిబి కేసులు పెట్టగా, వారిని విధుల నుంచి తొలగించారు. ఇద్దరూ హైకోర్టును ఆశ్రయిస్తూ తాము ఒప్పంద సిబ్బంది మాత్రమేనని, భూముల క్రమబద్ధీకరణ లాగిన్లతో సంబంధం లేదని వాదించారు. హైకోర్టు ఆదేశాల మేరకు అప్పటి తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ సహా పలువురిని ఎస్‌డిసి విచారించారు. లాగిన్ల వినియోగంపై రాతపూర్వక వివరణలు తీసుకున్నారు.

వేతన బకాయిలివ్వాలని వినతి

ప్రజాశక్తి-రామభద్రపురం

వేతన బకాయిలు చెల్లించాలని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన స్థానిక మేజర్ పంచాయతీ కార్మికులు శనివారం బొబ్బిలిలో ఎమ్మెల్యే బేబినాయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి జీతాల విడుదలకు, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.

ఒడిశాలో ఉణుకూరు వాసి మృతి

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని ఉణుకూరు గ్రామానికి చెందిన కడగల రాము(53) శుక్రవారం ఒడిశాలో మృతి చెందారు. పూరి జిల్లా పిప్పిలి పట్టణంలో రాము నివాసం ఉంటున్నారు. కాలువలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందారు. రాము 30 ఏళ్లుగా ఉపాధి రీత్యా ఒడిశాలో ఉంటున్నారు. పూరి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. శనివారం ఉదయం స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకువచ్చారు. రాముకు భార్య పెంటమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

13 మందిపై బైండోవర్

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో బెల్టు షాపుల కేసుల్లో పట్టుబడిన ఎనిమిది మంది, అనుమానితులు ఐదుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. తహశీల్దార్ మరడాన అరుణకుమారి సమక్షంలో శనివారం 13 మందిని హాజరుపరిచారు. బెల్టుషాపులు నిర్వహించినా, అందుకోసం గ్రామాల్లో వేలంపాటలు జరిగినా కఠిన చర్యలు తప్పవని సిఐ జె.జనార్దనరావు హెచ్చరించారు. 9440902367 నంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు పి.నరేంద్రకుమార్, పి.శాంతి లక్ష్మి, హెచ్‌సి సి.హెచ్ లోకాభిరామ్, కానిస్టేబుల్ ఎ.అప్పారావు పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ బొబ్బిలి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S 174/2017

Between :
కుప్ప సింహాచలం వాగైరాలు. .....వాది
And
K.V. రమణ మూర్తి వగైరాలు ......ప్రతివాది
To.

D12. కుప్ప విజయ శంకర రావు S/o late గురుమూర్తి aged 48 years దాడితల్లి గుడి దగ్గర గొల్లపల్లి గ్రామం బొబ్బిలి మండలం విజయనగరం జిల్లా.
D13. కుప్ప లక్ష్మి నారాయణ మూర్తి S/o late గురుమూర్తి aged 40 yearsదాడితల్లి గుడి దగ్గర గొల్లపల్లి గ్రామం బొబ్బిలి మండలం విజయనగరం జిల్లా.
D14. డర్రు అరుణ కుమారి W/o D.T.V. రమణ, పరదేశి అపార్టుమెంట్ ఫ్లాట్ నెంబర్ 303, రైతు బజార్, సీతమ్మ ధార, విశాఖపట్నం
D15. కుప్ప లక్ష్మణ రావు S/o లేట్ నారాయణ, సెయింట్ మేరీ స్కూల్, బంకుల దిబ్బ విజయనగరం.
D19. లింగాల భారతి W/o వీర రాజు S.C కాలనీ, పినపెంకి గ్రామం, బాడంగి మండలం
D20. చాపల సత్యవతి W/o పైడి రాజు, కూరాకుల వీధి, గొల్లపల్లి గ్రామం బొబ్బిలి మండలం విజయనగరం జిల్లా,

పై నెంబర్ దావా ఇందలి ప్రతి వాదులుపై డిక్లరేషన్ దావా దాఖలు చేసిఉన్నాం. సదరు దావా వాయిదా **తేదీ8-12-2025**కి వాయిదా అయి ఉన్నది సదరు వాయిదా దినం పైకోర్టులో **ఉదయం 10.30 గంటలకు** స్వయంగాగాని, వకీలు ద్వారా గాని హాజరు కావలియును. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించ బడునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కందాపు ప్రసాద రావు
వాది తరుపు వకీలు
బొబ్బిలి